# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అనంతపురం జిల్లాలో హంద్రీనీవా సుజల స్రవంతి పనులను పరిశీలించారు.
- గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.
- నిరుద్యోగులకు ప్రభుత్వం ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు.
- రాష్ట్రంలో పరిశ్రమలను స్థాపించే వారికి పూర్తి ప్రోత్సాహకాలను అందిస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.

======================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా, ఉరవకొండ నియోజకవర్గం, చాయాపురంలో హంద్రీనీవా సుజల స్రవంతి పనులను ఈరోజు పరిశీలించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల వివరాలను, పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. హంద్రీనీవా పనులపై అధికారులు ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. కిలోమీటర్ల మేర సాగుతున్న పనులను డ్రోన్ సహాయంతో పరిశీలించారు. రోజు ఎంతమేర పనులు పూర్తి చేశారో డ్రోన్ ద్వారా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. నాలుగు ఏజన్సీల ద్వారా పనులు జరుగుతున్నాయని, కురిసిన వర్షాలతో పనులకు కొంతమేర ఆటంకం కలిగిందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ఆర్థిక అసమానతలు తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుంటేనే ముందుకెళ్లగలమని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

======================

రాష్ట్రంలోని అన్ని గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, తాగు నీరు, రోడ్లను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. రాష్ట్రంలోని 9 ఐటీడీఏ పీవోలు, ఇతర అధికారులతో కలిసి ఈరోజు

ఆమె విజయవాడలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. జూన్ నెలలో పాఠశాలలు ప్రారంభించే నాటికి మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్ణయించామన్నారు. దీనికోసం మంత్రి నారా లోకేష్ 156 కోట్ల రూపాయలు మంజూరు చేశారని తెలిపారు.

======================

రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈరోజు ఆయన విజయనగరం జిల్లాలో మొట్టమొదటి ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణానికి బలిఘట్టంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూనే.. అభివృద్ధిపై దృష్టి పెట్టిందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తోందని చెప్పారు. దేశంలో నెలకొల్పనున్న పరిశ్రమలను రాష్ట్రానికి రప్పించేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని, ఇక్కడ పరిశ్రమలను స్థాపించే వారికి పూర్తి ప్రోత్సాహకాలను అందిస్తున్నామని మంత్రి తెలియజేశారు.

======================

శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన అగ్నివీర్ మురళీ నాయక్ వీర మరణం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, సహా పలువురు మంత్రులు, ఇతర ప్రముఖులు సంతాపం ప్రకటించారు. మురళీ నాయక్ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడిన ముఖ్యమంత్రి వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

======================

భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రాబాబు నాయుడు ఢిల్లీలోని ఏపీ భవన్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. పాకిస్తాన్‌తో సరిహద్దు గల రాష్ట్రాలలో నివసిస్తున్న లేదా ఆయా రాష్ట్రాలకు వెళుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల సౌకర్యం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. జమ్మూ కశ్మీర్, లఢక్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో ఉంటున్న ఆంధ్రులు.. సమాచారం, సహాయం కోసం నిరంతరం పనిచేసే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

విరామం

======================

రాష్ట్రంలోని నిరుద్యోగులందరికీ ప్రభుత్వం ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో వికాస జేకేసీ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఉద్యోగ మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ ఉద్యోగ మేళాకు సుమారు 42 సంస్థల ప్రతినిధులు హాజరయ్యాయని, 2 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారని తెలిపారు. ఈ మేళాలో ఐటీ సంస్థలు ఎక్కువగా పాల్గొన్నాయని, వచ్చే మేళాలో పర్యాటకం, అతిథ్య రంగాల సంస్థలను ఆహ్వానిస్తామని తెలిపారు. యువత వద్దకే ఉద్యోగాలు తెచ్చేందుకు జిల్లా పరిధిలో వికాస సంస్థ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల సహకారంతో ఈ ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

======================

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ శాప్ చైర్మన్ రవినాయుడు ఈరోజు అల్లూరి జిల్లాలో పర్యటించారు. అరకు నియోజకవర్గంలోని డుంబ్రిగుడ మండలం అంజోడా గ్రామంలో గిరిజన క్రీడా పాఠశాలలకు కేటాయించిన స్థలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... జిల్లాలో క్రీడల అభివృద్ధిపై శాప్ ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ప్రత్యేక

దృష్టి సారించిందన్నారు. పీ4 విధానం ద్వారా గిరిజన యువతకు అత్యుత్తమ క్రీడా సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రవినాయుడు తెలియజేశారు.

======================

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి హామీ కార్మికులకు పనులు కల్పించడంలో శ్రీకాకుళం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు డాక్టర్ పి. సుధాకరరావు అన్నారు. శ్రీకాకుళంలో ఈరోజు ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో  ప్రస్తుతం రోజుకు 2.30 లక్షల మంది ఉపాధి శ్రామికులు పని చేస్తున్నారని తెలిపారు. అలాగే.. వికలాంగులు, మహిళలకు పనులు కల్పించడంలో కూడా రాష్ట్రంలో జిల్లా అగ్రస్థానంలో ఉందని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 1,500 కోట్లతో 51 వేల పనులు మంజూరు చేసి సిద్ధంగా ఉంచామని.. వలసల నివారణకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చామని సుధాకరరావు వివరించారు.

======================

పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిచర్యగా త్రివిధ దళాలు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' కు మద్దత్తుగా రాష్ట్ర సచివాలయం ఉద్యోగులు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. సచివాలయం మొదటి భవనం నుండి ప్రధాన గేటు వరకూ ఈరోజు జరిగిన ర్యాలీలో అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని, జయహో ఆపరేషన్ సింధూర్, జై జవాన్, జై భారత్, భారత్ మాతాకి జై నినాదాలు చేశారు. అలాగే పాకిస్తాన్ కాల్పుల్లో అమరుడైన రాష్ట్రానికి చెందిన 'అగ్నివీర్ మురళీ నాయక్ అమర్ రహే' అంటూ.. నినదించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న సైనికులకు దేశ ప్రజలంతా మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.

======================

డీఎస్సీ కి అర్హులైన దివ్యాంగ అభ్యర్థుల కోసం ఉచిత మెగా డీఎస్సీ క్రాష్ కోర్సు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని అనకాపల్లి జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు బి.ఆశయ్య తెలిపారు. దృష్టిలోపం, వినికిడి లోపం, ఆర్థోపెడిక్ సమస్యలు తదితర దివ్యాంగ అభ్యర్థుల కోసం విజయవాడలో శిబిరం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఎస్జీటీ ఉపాధ్యాయ పోస్టులకు అర్హతగల 40 శాతం అంగవైకల్యం కలిగిన అభ్యర్థులు ఈ ఉచిత శిక్షణకు అర్హులని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

======================

రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులను సాధించేలా మేధోమధన సదస్సును నిర్వహిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ తెలిపారు. రాష్ట్ర ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఈరోజు విజయవాడలో మిర్చి, టమాట రైతులు, ఉద్యాన అధికారులు, శాస్త్రవేత్తలు, ఎగుమతి దారులతో నిర్వహించిన మేధోమధన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఉద్యాన రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర  పొందేలా బహుళ పంటలను చేపట్టాల్సిన అవసరం ఉందని సూచించారు.

======================
======================